క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. కార్తీక మాసం మూడో మంగళవారం కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మోర్, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ లక్ష్మీ గణపతి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీలో ఫీడర్ వద్ద చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ చక్రపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

అభినందన


అబ్దుల్ రవూఫ్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

పహాడీషరీఫ్: ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర గిగ్ ప్లాట్ ఫారం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన సయ్యద్ అబ్దుల్ రవూఫ్‌కు పలువురు నేతలు అభినందనలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల డైరెక్టర్ ఫయీం ఖురేషీల చేతుల మీదుగా ఆయన గాంధీభవన్‌లో మంగళవారం సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా రవూఫ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఫుడ్ డెలవరీ, క్యాబ్ డ్రైవింగ్, ఆన్‌లైన్ సరుకుల డెలివరీ తదితర పనులుచేసే వారికి ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి విశ్రాంత తహసీల్దార్ సరాపు జగదీశ్వర్ మంగళవారం రూ.1లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగదీశ్వర్ విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, అప్పి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

మహేశ్వరం: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు వినతి పత్రం అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాల్లో అర్హులైన పేదలందరినీ గుర్తించి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే విధంగా చేయాలని కోరారు. ఈ విషయంపై తగు చర్యలు చేపడుతామని కేఎల్లార్ సూచించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ బి.దత్తునాయక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహ, మండల కార్యదర్శి పల్నాటి యాదయ్య, నాయకులు చంద్ర శేఖర్‌రెడ్డి, శివ ప్రచండ, సుధాకర్, దేవేందర్, కుమార్ పలువురు పాల్గొన్నారు.


కొత్తగూడ రోడ్డులో చెట్ల కొమ్మలను తొలగించిన అధికారులు


రాచులూరు రోడ్డులో నరికివేసిన చెట్లు

నాటుడెందుకు.. నరుకుడెందుకు?

కందుకూరు: అధికారుల సమన్వయ లోపంతో ఓ పక్క చెట్లను పెంచడం మరో పక్క ఆ పెరిగిన చెట్లను నరకడం సాధారణంగా మారింది. పంచాయతీ అధికారులు హరితహారంలో భాగంగా గత ప్రభుత్వంలో రోడ్ల వెంబడి విరివిగా చెట్లను నాటించారు. ఆ నాటిన మొక్కలు చాలా చోట్ల విద్యుత్ తీగల కిందనే నాటారు. ప్రస్తుతం ఆ చెట్లు ఏపుగా పెరిగి రోడ్లకు ఇరువైపులా పచ్చలహారంగా మారాయి. కాగా విద్యుత్ తీగల కింద పెరిగిన ఆ చెట్లను మరోవైపు విద్యుత్ అధికారులు తొలగిస్తున్నారు. ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తెగ నరికిస్తున్నారు. మండల పరిధిలోని చాలా గ్రామాలకు వెళ్లే రహదారుల వెంబడి ఏపుగా పెరిగిన చెట్లను ఇలా నరికేస్తున్నారు. దీంతో ప్రజల సొమ్ము బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. మొక్కలు నాటేటప్పుడే విద్యుత్ తీగలను చూసుకొని నాటితే ఇప్పుడు ఆ చెట్లను నరకాల్సిన అవసరం ఉండేది కాదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవిష్యత్‌లో ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక


చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కందుకూరు మండానికి చెందిన సభావత్ కృష్ణనాయక్, వైస్ చైర్మన్‌గా మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన చాకలి యాదయ్యను ఎంపిక చేసిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మార్కెటింగ్ శాఖ అధికారులకు మంగళాశం ప్రతిపాదనలు పంపారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టి గౌరవిస్తామన్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన వారికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ల పదవులను కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. చైర్మన్ పదవి కోసం పోటీపడిన వారిని త్వరలో కలిసి భవిష్యత్ భరోసా కల్పిస్తామన్నారు. అంతకుముందు కృష్ణానాయక్, చాకలి యాదయ్యలను ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, ఎనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు కావలి దశరథ, ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, పాండు రంగారెడ్డి, చంద్రమోహన్, రంజిత్‌కుమార్, అర్జున్ పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు ఆదర్శం

తుక్కుగూడ: దేశానికి దేశ మాజీ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ సేవలు ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కేఎల్లార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కృష్ణానాయక్, జానకీరామ్, యాదయ్య, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే

పనులు త్వరగా పూర్తిచేసేందుకు కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య


బైపాస్ రోడ్డు చదును చేసే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు పనులు త్వరగా పూర్తిచేసేలా కృషి చేస్తానని చెప్పారు. ముందుగా భూసేకరణ చేపట్టిన రూట్ మ్యాప్‌ప్రకారం బైపాస్‌లలో చదును చేస్తున్నారన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. త్వరలోనే ఈరోడ్డు పనులు పూర్తవుతాయని చెప్పారు. బైపాస్ రోడ్లు క్లియర్ అయితే కొంతమేర మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రాములు, నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, గంగి యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, చాన్‌పాషా, జనార్ధన్ , సత్యనారాయణ, మధుసుధన్‌రెడ్డి, సాయి, చోటు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మండల కేంద్రంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. స్థానిక నాయకులు డీ.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, యాదయ్య, వీరేందర్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తాలతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

సొంత నిధులతో గుంతల పూడ్చివేత


రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ప్రవీణ్‌చారి అతని స్నేహితులు

చేవెళ్ల: అందరిలా పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలు చేసుకోకుండా ఓ యువకుడు వినూత్నంగా ఆలోచన చేసి నలుగురికి ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమాన్ని చేటపట్టాడు. మంగళవారం చేవెళ్లకు చెందిన అవుసుల ప్రవీణ్‌చారి తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను సొంత డబ్బులు వెచ్చించి రీబీటీ కాంక్రీట్ సహాయంతో పూడ్చివేయించాడు. తన స్నేహితులు, ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించి చేవెళ్ల నుంచి మీర్జాగూడ వరకు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేసే పనులు మొదలుపెట్టాడు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనదారులు అతనిని అభినందించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌చారి స్నేహితులు,ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు


అన్నదాత ప్రభాకర్‌యాదవ్ దంపతులను సన్మానిస్తున్న గురుస్వామి

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాలదారులకు మంగళవారం నర్సప్పగూడకు చెందిన కావలి ప్రభాకర్‌యాదవ్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి గురుస్వామి గిరిషన్‌నాయర్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. మాలదారులకు అన్నదానం చేయడం చాలా పుణ్యఫలమన్నారు. అనంతరం అన్నదాత దంపతులను గురుస్వామి సన్మానించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్


పూజలో చైర్మన్ నరేందర్, నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. కార్తీక మాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక గంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వన్నాడ వెంకటేశ్‌గౌడ్, సుజీవన్, అనిల్, శేఖర్‌రెడ్డి, గజవాడ నర్సింలు, కోటి లింగంగౌడ్, అఖిలాశ్, గోపాల్, ప్రవీణ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్‌లాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ రోడ్లకు మోక్షం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో రూ.36.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతుండడంపై మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ హర్షం వ్యక్తం చేశారు. బస్తీలో ఇన్నాళ్ల పాటు గోతులమయమైన దారులతో స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆమె ఆదేశాల మేరకు నూతన రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారి అధ్వానంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారన్నారు. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడం సంతోషకరమని, ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.


వాదే ముస్తఫా బస్తీలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి


ఆర్టీసీ డిపోలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. ఆర్టీసీ కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఉద్యమంపై ఆంక్షలు విధించిందన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీలో యూనియన్ కార్యాకాలాపాలకు అనుమతిస్తామని కాంగ్రెస్ పార్టీ కార్మికులకు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తయిన ఇంతవరకు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేదన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అంతకుముందు డిపోలో ఆర్టీసీ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, జిల్లా కమిటీ సభ్యుడు బుట్టి బాల్‌రాజ్, మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో నామినేటెడ్ పదవులిస్తాం

- రాజకీయ పరిణామాలతోనే చైర్మన్ పదవి ఇవ్వలేకపోయాం
- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్


మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం: మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మహేశ్వరానికి చెందిన వారికి ఇద్దామని అనుకొని రాజకీయ పరిణామాల కారణంగా కందుకూరు మండలానికి ఇస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుక్కుగూడ క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపికపై మహేశ్వరం, కందురూరు మండలానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మహేశ్వరం మండలానికి చెందిన వారికి ఇవ్వాలని అందరం నిర్ణయించుకున్నామని, రాజకీయ పరిణామాల కారణంగా కందుకూరు మండలానికి చెందిన సభావత్ కృష్ణానాయక్‌కు అవకాశం ఇస్తున్నామన్నారు. మహేశ్వరం నేతలకు మాట ఇచ్చి తప్పినందుకు తనను క్షమించాలని నాయకులు, కార్యకర్తలను కోరుతున్నానని తెలిపారు. భవిష్యత్‌లో మహేశ్వరం మండలానికి చెందిన సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవులు అప్పగించి గౌరవిస్తామన్నారు. త్వరలో మహేశ్వరం మండలానికి చెందిన చైర్మన్ పదవి కోసం పోటీపడిన గిరిజన సోదరులను కలుస్తానన్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాలు తనకు రెండు కళ్లు లాంటివన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక విషయంలో మహేశ్వరం నేతలకు అన్యాయం జరిగిందని, వచ్చేసారి మహేశ్వరం మండలానికి చెందిన వారికే చైర్మన్ ఇస్తామన్నారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన చాకలి యాదయ్యకు వైస్ చైర్మన్ పదవి ఇస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి డైరెక్టర్లుగా అవకాశం ఇచ్చి గౌరవిస్తామన్నారు. దయచేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడి, అసంతృప్తికి గురికాకుండా పార్టీ బలోపేతానికి ముందుకు రావాలని ఆయన సూచించారు. అంతకుముందు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సభావత్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్‌గా చాకలి యాదయ్యల పేర్లను ప్రతిపాదిస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులను పంపారు.

సమావేశానికి గైర్హాజరైన గిరిజన నాయకులు, కార్యకర్తలు

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపికపై తుక్కుగూడలో కేఎల్లార్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి మహేశ్వరం మండలానికి చెందిన గిరిజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గైర్హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మహేశ్వరం మండలానికి చెందిన వారికి ఇస్తామని పలుమార్లు మాట ఇచ్చి ఇప్పుడు తప్పారని, తమని మోసం చేశారని మహేశ్వరం గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ కోసం పోటీపడిన వారిలో నేనావత్ రాజునాయక్, అంగోత్ కృష్ణానాయక్, మునావత్ పాండునాయక్, నేనావత్ విఠల్‌నాయక్‌లతో పాటు వారి అనుచరులు సమావేశానికి దుమ్మాకొట్టారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కావలి దశరథ, నాయకులు ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్, పాండురంగారెడ్డి, జానకీరామ్, కూన యాదయ్య, అందుగుల సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, ఆవుల యాదయ్య, రఘుపతి, నర్సింహ, బాల్‌రాజ్, అంజయ్య, శివ, పాండు రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, యాదయ్య, రాజు, రంజిత్‌కుమార్, శేఖర్, అర్జున్, ప్రవీణ్, బాల్‌రాజ్ పలువురు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

వాసవి క్రోన్ స్టార్ కేసీజీఎఫ్ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధికి వాసవి క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్రోన్‌స్టార్ కేసీజీఎఫ్ పిప్పళ్ల అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రామలింగేశ్వరస్వామి సహకార సంఘ భవనంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ గుగ్గిళ్ల స్వాతిబాలరాజేశ్ ఆధ్వర్యంలో రీ కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశోక్‌కుమార్ హాజరై రీజియన్ పరిధిలోని వాసవి క్లబ్‌లు చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను పరిశీలించారు. వాసవి, వనితా క్లబ్‌లు చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఆయా క్లబ్‌ల అధ్యక్షులను అభినందించారు. క్లబ్ చేపట్టిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ప్రెసిడెంట్ పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌గా గుడిపల్లి వెంకటరమణ(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా గుడిపల్లి రవికుమార్(షాద్‌నగర్), థర్డ్ బెస్ట్ ప్రెసిడెంట్ వాసవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు కొండ రమ(కాటేదాన్, శివరాంపల్లి)కు పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ సెక్రటరీగా ఎంబీఏ సురేశ్‌కుమార్(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ సెక్రటరీ కల్వ పుష్పాంజలి(షాద్‌నగర్), థర్డ్ బెస్ట్ సెక్రటరీగా రవికుమార్(కాటేదాన్)కు పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ ట్రెజరరీగా కల్వమాణిక్యం(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ ట్రెజరరీగా స్వప్న(షాద్‌నగర్), రాజు(శివరాంపల్లి)కు పతకాలను అందజేశారు. అనంతరం పిప్పళ్ల అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుపేదల అభివృద్ధికి వాసవి, వనితా క్లబ్‌లు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పేదల ఉపాధికి సాయాన్ని అందించి వారికి ఆర్థిక భరోసాను కల్పించడం హర్షణీయమన్నారు. సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహ, కార్యదర్శి వాడకట్టు విజయకుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అనంతం, ఎలుకుర్తి శ్రీనివాస్, పాలాది వెంకటరమణ, నవీన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీనివాస్, జగదీశ్వర్, ప్రవీణ్, మాధవి, శ్యామల, ఆనంద్, సత్యనారాయణ, రాజన్‌కుమార్ పాల్గొన్నారు.